జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 27-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 84 పేజీలు: 8 వెల : రూ.7

# అడ్డదారిలో.. దోపిడి






*** ఓవర్‌లోడ్‌తో వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ * కార్గోను తలపించేలా బస్సులపై సరుకుల రవాణా * బస్సులపైనా.. లోపల భాగంలో సరుకులు * జీఎస్టీ ఎగవేసి అడ్డదారిలో రవాణా * ఓవర్‌లోడ్‌తో పొంచి ఉన్న ప్రమాదం * పోలీసు, ఆర్టీఏ, జీఎస్టీ అధికారులకు నెలవారీ ముడుపులు * కన్నెత్తి చూడని అధికార గణం * ఆర్టీసీ కార్గోకు భారీగా నష్టం**



**టెక్కలి, జులై 26(వార్త):** విజయవాడ నుంచి శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస, పాతపట్నం, కొత్తూరు వరకు తిరుగుతున్న పలు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అక్రమ సరుకుల రవాణాకు అడ్డగా మారాయి. ప్రయాణికులతోనే తిరగవలసిన ప్రైవేట్ ట్రావెల్ బస్సుల్లో భారీ ఎత్తున సరుకులు తరలిస్తున్నాయి. బస్సుల టాప్‌ల్లో, లోపల భాగాల్లో పెద్ద ఎత్తున బరువుతో కూడిన సరుకులను చేరవేస్తున్నాయి. బయట నుంచి ఈ ఓవర్‌లోడ్‌తో వెళుతున్న బస్సులను చూస్తుంటే ఇవెక్కడ పడిపోతాయో అన్న భయాందోళన కలగకమానదు. ఈ బస్సులను కమర్షియల్ టాక్స్, జీఎస్టీ, పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సివున్నా.. వారు కన్నెత్తి చూడడం లేదు. దీంతో ఇష్టారాజ్యంగా సరుకులు రవాణా అవుతోంది. ముఖ్యంగా వ్యాపారులు పన్నులు ఎగ్గొట్టి అడ్డదారిలో సరుకులను ట్రావెల్స్ బస్సులు ద్వారా తెప్పించుకుంటున్నారు. వేలల్లో బిల్లులు చూపిస్తూ లక్షల్లో సరుకులు తరలించేస్తున్నారు. బస్సుపై భాగంలో పరదాలు కట్టి పెద్ద ఎత్తున సరుకు రవాణా చేస్తున్నారు. బస్సుల్లో ప్రయాణికుల అవసరాల కోసం ఏర్పాటుచేసిన బాక్సుల్లో కూడా కొన్ని నిషేధిత సరుకులు రవాణా జరుగుతున్నట్లు సమాచారం. జాతీయ రహదారిపై వందలాది కిలోమీటర్లు ఇస్తారాజ్యంగా అధికలోడుతో ట్రావెల్స్ బస్సులు తిరుగుతున్న సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రభుత్వ రంగ సంస్థలైన ఆర్టీసీ సంస్థ కార్గో సర్వీస్ ద్వారా సేవలు అందిస్తుంది. అయితే అడ్డదారిలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు సరుకు రవాణా చేయడం వలన ఆర్టీసీ సంస్థకు భారీగా నష్టం కలుగుతుంది. ప్రభుత్వ రంగ సంస్థ అధికారుల కళ్లెదుటే నష్టం జరుగుతున్నా మౌనం వహిస్తున్నారు.

**పోలీసులు ఏం చేస్తున్నారు..**




స్థానిక రహదారుల్లో తిరిగే చిన్న వాహనాలు ఓవర్ లోడ్‌తో వెళితే కేసులు కట్టి ఫైన్‌లు వేసే ఆర్టీఏ, పోలీసు అధికారులు ఈ ప్రైవేట్ వాహనాలు జోలికి వెళ్లకపోవడం శోచనీయం. వీరికి పెద్ద ఎత్తున ముడుపులు అందుతున్నాయని నేపథ్యంలోనే సంబంధిత అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని బహిరంగ విమర్శలు వినపడుతున్నాయి. ఏదేమైనా ప్రయాణికుల ప్రాణాలు పణంగా పెట్టి ట్రావెల్స్ బస్సులు సరుకులు రవాణా చేస్తున్న బస్సులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కన్నా.. ముందే స్పందిస్తే ప్రాణాలు కాపాడిన వారవుతారు. గతంలో విజయవాడ నుంచి నరసన్నపేట, నరసన్నపేట నుంచి విజయవాడ వెళ్లే ప్రైవేట్ ట్రావెలర్స్ బస్సుల్లో బంగారం, నగదు పెద్ద ఎత్తున పట్టుబడిన విషయం తెలిసిందే. నరసన్నపేటకు చెందిన కొందరు వ్యాపారులు ఇప్పటి కూడా గుట్టుచప్పుడు కాకుండా ఈ ప్రైవేట్ ట్రావెలర్స్‌లోనే బంగారం తరలిస్తున్నారన్న గుసగుసలు ఉన్నాయి. అలాగే సరిహద్దు ప్రాంతాల నుంచి బయలుదేరే బస్సుల్లో కూడా మత్తు పదార్థాలు రవాణా అవుతున్నాయి. ఇకనైనా జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పందించి ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి ప్రవేశిస్తున్న ప్రైవేట్ ట్రావెలర్స్‌లపై నిఘా పెట్టి తనిఖీలు చేయిస్తే సరుకులు అక్రమ తరలింపునకు చెక్ పడే అవకాశం ఉంది.

## విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

*** కోటబొమ్మాళి కేజీబీవీ భవనం మొదటి అంతస్థు నుంచి దూకిన బాలిక * కాలుజారిందని కొందరు.. లేదు లేదంటున్న మరికొందరు * రిమ్స్‌లో బాలికకు చికిత్స**



**టెక్కలి, జులై 26 (వార్త):** కోటబొమ్మాళి కేజీబీవీ మొదటి అంతస్తు నుంచి ఓ విద్యార్థిని దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. కోటబొమ్మాళి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ బొడ్డాపు పూజ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతోంది. గురువారం ఆమె ఇంటికి వెళ్లి తిరిగి కేజీబీవీకి చేరింది. ఏమైందో గాని రాత్రి భోజనాల తరువాత మేడ మొదటి అంతస్తుపైకి వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకింది. దీన్ని గమనించిన తోటి విద్యార్థినులు సిబ్బందితో పాటు టెక్కలి మండలం పరశురాంపురంలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. పూజను కోటబొమ్మాళి ఆసుపత్రికి తరలించారు. ఆమెకు మెరుగైన వైద్య సేవలకుగాను శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. ఆమె కోలుకున్న తర్వాత గాని ఆత్మహత్యాయత్నానికి ఎందుకు పాల్పడిందో బయట పడదు. అయితే కేజీబీవీ అధికారులు మాత్రం పూజ కాలుజారి పడిందని చెబుతున్నారు. తోటి విద్యార్థినులు సైతం నోరు మెదపడం లేదు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని కోటబొమ్మాళి పోలీసులు చెబుతున్నారు.

# సైనికా.. వందనం

*** జిల్లావ్యాప్తంగా అమర జవాన్లకు నివాళులు * వాడవాడలా కార్గిల్ విజయ దివస్**



**శ్రీకాకుళం, జులై 26 (వార్త):** కార్గిల్ విజయ్ దివాస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా యుద్ధంలో పాల్గొని అమరులైన సైనికులకు జిల్లావ్యాప్తంగా నివాళులు అర్పించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, మరికొందరు క్యాండిల్స్ వెలిగించి నివాళులు అర్పించారు. శుక్రవారం జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో కార్గిల్ విజయ్ దివస్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు. కార్గిల్ యుద్ధంలో అంగవైకల్యం పొందిన ఇద్దరు మాజీ సైనికులను సన్మానం చేసి, నగదు పురస్కారాలతో సత్కరించారు. ప్రత్యక్షంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులను అభినందించారు. జిల్లాలో గల మాజీ సైనికులు, వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. భారతమాత ముద్దుబిడ్డలుగా నేటి యువత ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలని కోరారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి ప్రసంగిస్తూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికుల త్యాగాలను స్మరించుకునే రోజు అని అన్నారు. దేశాన్ని కాపాడిన సైనికుల సేవలను గుర్తుంచుకుని సత్కరించడం మన కర్తవ్యమని వివరించారు.

### యుద్ధ వీరులకు కేంద్ర మంత్రి నివాళి

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ దగ్గర రజిత్ జయంత్ వర్మ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు. భారతదేశం గర్వంగా సాయుధ దళాల పరాక్రమాన్ని గుర్తించుకున్న రోజని ఆయన పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం సైనికులు చేసిన త్యాగాలు గుర్తు చేసుకుంటూ ఆయా కుటుంబాలకు తాను కుటుంబ సభ్యుడిలా, ఒక సోదరుడులా అండగా ఉంటానని తెలిపారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



## బాలల పురస్కారాలకు దరఖాస్తుల గడువు పెంపు

**శ్రీకాకుళం టౌన్, జులై 26 (వార్త):** ఆంధ్ర ప్రదేశ్ లోని అన్ని జిల్లాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న 5–18 ఏళ్లు లోపు వయస్సు గల బాలల నుంచి దరఖాస్తులు స్వీకరణకు ఆగస్టు 31 వరకూ గడువును కేంద్ర ప్రభుత్వం పెంచిందని ఎస్సిపిసిఆర్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్య సాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మొదలైన వాటిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనపరుస్తున్న భారత దేశ సంతతికి చెందిన బాలలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. http/awards.gov.in ద్వారా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

# క్రమశిక్షణతో విధులు నిర్వహించండి

*** సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం * ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి * ఎచ్చెర్ల ఆర్మడ్ రిజర్వు మైదానంలో పరేడ్**




**శ్రీకాకుళం క్రైం, జులై 26 (వార్త):** పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, వ్యక్తిగత, ఉద్యోగరీత్యా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి శుక్రవారం ఉదయం ఎచ్చెర్ల జిల్లా ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో నిర్వహించిన పోలీస్ పరేడ్‌కు జిల్లా ఎస్పీ హాజరయ్యారు. ముందుగా ఆర్మడ్ సిబ్బంది గౌరవ వందనాన్ని ఎస్పీ స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఒక్కరు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ప్రతిరోజు కొంత సమయాన్ని వ్యాయమానికి కేటాయించాలన్నారు. అనంతరం పలువురు సిబ్బంది వారి వ్యక్తిగత, ఉద్యోగరీత్యా సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ పరేడ్ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్, డీఎస్పీలు ఎల్.శేషాద్రి, జి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ అవతారం, ఏఆర్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంకల్ప ట్రస్టు సేవలు అభినందనీయం

*** రిటైర్డు జడ్జి పుండరీకాక్షుడు**
*** రూ.7లక్షలతో తరగతి గది ప్రారంభం**

**మందస, జులై 26 (వార్త):** సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణానికి సంకల్ప ట్రస్టు స్వచ్ఛంద సంస్థ రూ. 7లక్షలు వెచ్చించింది. శుక్రవారం అదనపు తరగతి గదిని రిటైర్డు జడ్జి ఆర్.పుండరీకాక్షుడు(విశాఖపట్నం) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్ప ట్రస్టు సేవలు అభినందనీయమన్నారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు స్వచ్ఛంద సేవలు ముందుకువస్తున్నారని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి దాతలు సహకారం అందించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు సుందర సాల్మన్ మాట్లాడుతూ పిల్లలకు మంచి వసతి కల్పించిన సంకల్ప ట్రస్ట్‌కు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సంకల్ప ట్రస్ట్ ప్రతినిధులు ఆర్.జగన్మోహనరావు, పి.నేతాజీ, సీహెచ్ విశ్వప్రసాద్, డి.వెంకటరమణ, సీహెచ్ కృష్ణ ప్రసాద్, ఇ.నారాయణమూర్తి, కె.రమేష్, గ్రామపెద్దలు ఔగాన ఈశ్వరరావు, చింతాడ లక్ష్మీనారాయణ, మామిడి కల్యాణ్, మల్లారెడ్డి భాస్కరరావు, యానాది వాసుదేవు, మద్ది సురేష్, మద్ది సత్యం, మిస్క గణపతి, సీహెచ్ దీపక్, కె.రాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో
# కౌన్సెలింగ్ ప్రారంభం

**శ్రీకాకుళం, జులై26(వార్త):** రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీకాకుళం ఐఐఐటిలో ప్రవేశానికి కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో నుండి ఇక్కడకు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులకు అన్ని రకాలుగా సదుపాయాలను అధికారులు ఏర్పాటు చేశారు. ముందస్తు ఏర్పాటులో భాగంగా విద్యార్థులకు టోకెన్ ఇచ్చి కౌన్సెలింగ్ కేంద్రానికి అనుమతించారు. కుల, సర్టిఫికెట్ ధ్రువీకరణ పత్రాలు పరిశీలన, ఫీజు చెల్లించడం, సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరచడం వంటిపై అవగాహన కల్పించారు. ఆర్‌జి యుకేటి అడ్మిషన్స్ కన్వీనర్ డాక్టర్ అమరేంద్ర కుమార్, డైరెక్టర్ ఆచార్య బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, కోఆర్డినేటర్ గోవర్ధనరావు, కోఆర్డినేటర్ రమణ, పిఆర్ఓ షణ్ముఖ ప్రవేశం పొందిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియకి 100 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కౌన్సెలింగ్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఐఐఐటిలో ప్రవేశమునకు ఈ నెల 22 న కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైందని, ఆ ప్రక్రియ రేపటితో ముగుస్తుందన్నారు. నాలుగు ఐఐఐటి మిగులు సీట్స్ వివరాలు శనివారం సాయంత్రం వెల్లడిస్తామన్నారు. మిగులు సీట్లను మెరిట్ ప్రకారం ఆగస్టు మొదటి వారంలో రెండో విడత కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఐఐఐటిలో మొదటి ర్యాంక్‌లు సాధించిన విద్యార్థినీ విద్యార్థులు ఎస్.విద్యశ్రీ, ఎల్.భావన ఎస్. మానస, జి.షణ్ముకేశ్వర్, డి.రాకేష్, ఆర్జియుకేటి అధికారులు, సహాయ ఉద్యోగులు పాల్గొన్నారు.








## వ్యవసాయ రంగంపై
# కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం
### ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు

**పలాస, జులై26 (వార్త):** కేంద్ర ప్రభుత్వం వ్యవసాయం పట్ల పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందని రైతాంగాన్ని ఆదుకోవడంలో విఫలమైందని అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ వంకల మాధవరావు అన్నారు. శుక్రవారం పలాసలోని సూదికొండ కాలనీలో న్యూ డెమోక్రసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన 2024–25 వార్షిక బడ్జెట్లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత లేకుండా చేసిందని దుయ్యబట్టారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోను కార్పొరేట్ కంపెనీలకు వరాల జల్లు కురిపించిందని విమర్శించారు. కీలక రంగమైన వ్యవసాయ రంగంను పట్టించుకోలేదన్నారు. రైతాంగానికి ఇచ్చే అరకొర ఎరువులు, పురుగుమందులపై సబ్సిడీలు పూర్తిగా ఎత్తివేశారని తెలిపారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఎరువులపై సబ్సిడీలు 2494 కోట్లు తగ్గించారని తెలిపారు. ఆహారం కోసం సబ్సిడీ 7082 కోట్ల కోత పెట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నీరుగారుస్తున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలులో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు, వంకల పాపయ్య పాల్గొన్నారు.



## ఆధార్ ఎన్రోల్మెంట్ ప్రక్రియలో అలసత్వం వద్దు

**నరసన్నపేట,జులై 26 (వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపడుతున్న ఆధార్ ఎన్రోల్మెంట్, అప్డేషన్ ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని డీఎల్‌డీవో పడాల వాసుదేవరావు ఆదేశించారు. శుక్రవారం సత్యవరం, కంబకాయ సచివాలయాలలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఆధార్ ఎన్రోల్మెంట్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాలలో ప్రతి బుధ, శుక్రవారం చేపడుతున్న డ్రై డే ఫ్రైడే కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. సత్యవరం గ్రామంలోని స్థానిక పాఠశాల వద్ద పారిశుధ్య పనులను పరిశీలించారు.

## చురుగ్గా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

**గార, జులై 26 (వార్త):** తోణంగి, వమరవల్లి గ్రామ సచివాలయంలో ఆధార్ ఎన్రోల్మెంట్ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఆధార్ పేర్లను, చిరునామాలను మార్చుకునేందుకు పెద్ద ఎత్తున గ్రామస్థులు తరలివస్తున్నారు.సిస్టం ఆపరేటర్ లక్ష్మీనారాయణ ఎన్‌రోల్ చేస్తున్నారు.

## బేడ బుడగ జంగాలకు న్యాయం చేయాలి



**కంచిలి, జులై 26 (వార్త):** బేడ బుడగ జంగాల కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరులో న్యాయం చేయాలని జాడుపూడి సర్పంచ్ పిలక చిన్నబాబు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కోరారు. అమరావతిలో అసెంబ్లీ హాల్లో మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ మాదిని రామారావుతో కలిసి వినతి పత్రం అందజేశారు. గత కొంతకాలంగా బేడా బుడగ జంగం కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలు అధికారులు ఇవ్వకపోవడంతో వారి చదువులకు, ఉద్యోగాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వినతిపత్రం అందించిన వారిలో టీవీ రమణ, బి.పూర్ణ, బొడ్డ హరిబాబు, మద్దిల భాస్కరరావు, మర్రిపాటి పూర్ణ, దుబ్బ రామయ్య ఉన్నారు.

## కుష్టు వ్యాధిపై అవగాహన



**గార, జులై 26 (వార్త):** వాడపాలెం గ్రామంలోని మెరైన్ పోలీస్ స్టేషన్లో, కళింగపట్నం పీహెచ్‌సీ పరిధిలో కుష్టు వ్యాధిపై శుక్రవారం ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, నరాలు తిమ్మిర్లు, కనుబొమ్మలు మూతపడకపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక వైద్య సిబ్బందికి తెలియజేయాలని ఆరోగ్య సిబ్బంది పేర్కొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన

**జలుమూరు, జులై26 (వార్త):** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకేందుకు అవకాశముందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలుమూరు పీహెచ్సీ వైద్యాధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. స్థానిక పీహెచ్సీలో ఆరోగ్య కార్యకర్తలు ఆశలతో, సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు జరిగేలా చూడాలన్నారు. తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేయడం, కాచి చల్లార్చిన నీటిని తాగలన్నారు. దీనిపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# మొక్కలతోనే మానవ మనుగడ

**కంచిలి, జులై 26 (వార్త):** గోకర్ణపురం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుడు శమల్ల వెంకటరావు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వెంకటరావు మాట్లాడుతూ మొక్కలు నాటడంతోనే కాలుష్యం నివారించవచ్చని, మానవ మనుగడ సాధ్యపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను నాటి పర్యవేక్షించాలని సూచించారు.



## లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేయండి

**జలుమూరు, జులై26 (వార్త):** పాడి పశువులకు లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలను వేయాలని పశుసంవర్ధకశాఖ ఏడీ ఎం.లోకనాథం అన్నారు. సురవరం, అల్లాడ పశు వైద్య కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట పశు వైద్యాధికారులు సంతోష్ కుమార్, కె.నారాయణమూర్తి ఉన్నారు.

## నవధాన్యాల సాగుతో పరిపూర్ణ పోషకాలు



**నరసన్నపేట, జులై 26 (వార్త):** దేవాది గ్రామానికి చెందిన రైతు ఎం. నాగేశ్వరరావు ప్రకృతి విధానంలో చేపడుతున్న పంటల సాగును రాష్ట్ర వ్యవసాయాధికారులు ప్రకాష్, హేమసుందరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యం సాగు చేయడం వల్ల ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## బోధన పద్ధతులు మెరుగుపడాలి



**నరసన్నపేట,జులై 26 (వార్త):** విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభ రీతిలో బోధన ఉండాలని ఎంఈవో యు.శాంతారావు సూచించారు. జోగంపేట తదితర పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డిక్టేషన్ అలవాటు చేయండి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డిక్టేషన్ ప్రక్రియను ఒక అలవాటుగా చేయాలని ఎంఈఓ దాలినాయుడు సూచించారు. శుక్రవారం నరసన్నపేట మండలం గొట్టిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ శరీరానికి వ్యాయామం ఎలా ఉపయోగ పడుతుందో, డిక్టేషన్ కూడా మెదడుకు ఒక వ్యాయామంగా పనిచేస్తుందని చెప్పారు. ప్రాథమిక స్థాయి నుంచి దీనిని అవలంబించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## మైనర్ల డ్రైవింగ్‌తోనే ప్రమాదాలు

**శ్రీకాకుళం క్రైం, జులై 26 (వార్త):** మైనర్లు వాహనాలను నలపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని రెండో పట్టణ ఎస్ఐ హరికృష్ణ అన్నారు. ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ముగ్గురు మైనర్లు బైక్‌పై అతివేగంగా వెళుతూ ఓ విద్యార్థిని ఢీకొట్టారన్నారు. ఆమె తీవ్రంగా గాయాలపాలైందన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు పెడతామన్నారు. విద్యాసంస్థల యాజమాన్యం కూడా మైనర్లు వాహనాలు నడపకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. కొందరు యువత మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. యువత బాగా చదివి ఉన్నతులు కావాలే తప్ప మత్తుకు బానిస కాకూడదన్నారు.



# పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

*** జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * పరిశ్రమల శాఖపై సమీక్ష**



**శ్రీకాకుళం టౌన్, జులై 26 (వార్త):** ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తే మరిన్ని పరిశ్రమలు వస్తాయని, దీనివల్ల నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖపై సంబంధిత అధికారులతో ఆయన శుక్రవారం సమీక్షించారు. జిల్లాలోని ఏయే ప్రాంతాల్లో పరిశ్రమలు ఉన్నదీ కలెక్టర్ ఏడీ రమణారావు అడిగి తెలుసుకున్నారు. ఏపీఐఐసీ ద్వారా ఇచ్చే భూ వివరాలపై ఆరా తీశారు. ఎంఎస్ఎంఈ ద్వారా ఏర్పాటు చేసిన పరిశ్రమల గూర్చి వివరించారు. ఏజన్సీ, మైదాన ప్రాంతాల్లోని పరిశ్రమలపై తెలుసుకున్నారు. ఏపీఐఐసీ జీఎం పాండురంగారావు తమ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన పరిశ్రమలపై వివరించారు. రుణాలు మంజూరుపై ఎల్డీయం సూర్యకిరణ్ తెలియజేశారు. లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న వెంటనే బ్యాంకుకు పంపిస్తామని, అక్కడ నుండి బ్యాంకు ప్రతినిధులు ఇచ్చే సబ్సిడీ, మార్జిన్‌పై తెలిపారు. డిఐపిసిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల గూర్చి కలెక్టర్ అడగ్గా 41 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. రిజెక్షన్స్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఏ శాఖలో పెండింగులో ఉన్నది ఆయన ఆరా తీశారు. సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని ఆయన అడుగగా ఎపిఐఐసిలో ఉన్న సమస్యలపై డిజడ్ఎం పాండురంగారావు వివరించారు. మత్స్య శాఖ ద్వారా ఇచ్చే పథకాలపైన ఆయన ఆరా తీశారు. కోల్డు స్టోరేజ్ లాంటివి ఏమైనా ఉన్నాయా అని ఆయన అడుగగా చేపలు నిల్వ చేసే స్టోరేజీలు లేవని ఐస్ ఫ్యాక్టరీలు ఉన్నాయన్నారు. పిఎం విశ్వకర్మ పథకం గూర్చి ఆయనకు వివరించారు. ఇందులో 7138 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జె. ఉమామహేశ్వరరావు, ఎడిలు రమణారావు, రఘునాథ్, ఎల్డీయం సూర్యకిరణ్, ఎపిఎంఐపి డిడి శ్రీనివాసరావు, ఎపిఐఐసి డిజడ్ఎం పాండు రంగారావు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలుదారులకు అందుబాటులో ఇసుక ధర

**భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లకు ఆదేశం**




కొనుగోలు దారునికి ఇసుక రేటు అందుబాటులో ఉంటుందని భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో ఇసుకపై ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ లో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని చెప్పారు. రవాణా చార్జీలు మాత్రమే లబ్ధి దారుల నుండి వసూలు చేయాలని వెల్లడించారు. ఇసుక నిల్వ పాయింట్ల వద్ద రవాణా చార్జీలను శాశ్వతంగా డిసిప్లే చేయాలన్నారు. డీసిల్టేషన్‌ను వాటర్ రిసోర్స్ డిపార్ట్మెంట్ చూడాలన్నారు. ఇసుక రీచ్ ల వద్ద ట్రక్కులను అందుబాటులో ఉంచాలని చెప్పారు. రవాణా ఛార్జీలు ప్రజలకు అందుబాటులో రీజనబుల్ రేటు ఉండాలన్నారు. రవాణా ఛార్జీలను జిల్లా స్థాయి కమిటీ నిర్ణయించాలని చెప్పారు. స్టాక్ పాయింట్ల వద్ద సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. భూగర్భ గనుల శాఖ కమీషనర్ ప్రవీణ్ కుమార్ జిల్లాల వారీగా ఇసుక నిల్వ, వార్షిక డిమాండ్ యొక్క కార్యాచరణ ప్రణాళిక, రీచ్‌ల గుర్తింపు, రవాణా చార్జీలు, డీ సిల్టేషన్, తదితర వాటిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ స్టాక్ యార్డ్ లో ప్రస్తుతం 46 వేల టన్నుల ఇసుక నిల్వ ఉందని, డీ సిల్టింగ్ త్వరలోనే చేస్తామన్నారు. రవాణా చార్జీలు తీసుకుంటున్నట్లు వివరించారు. డీ సిల్టేషన్ పాయింట్ల వద్ద 15 రోజుల్లో ప్రారంభించాలని కమీషనర్ ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. జిల్లా నుండి జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిటిసి చంద్ర శేఖర్ రెడ్డి, ఎస్ఈబి అదనపు ఎస్పీ గంగాధరం, మైన్స్ ఎడి ఫణి భూషణ్ రెడ్డి, ఉప కలెక్టర్ ఇన్ చార్జ్ శ్రీకాకుళం ఆర్డీఓ అప్పారావు, ఉప కలెక్టర్ సుదర్శన్ దొర, విజిలెన్స్ స్క్వాడ్ కె. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి

**ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సుభాష్ బాబు**

**మందస, జులై26 (వార్త):** సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న, అన్ని యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.సుభాష్ బాబు కోరారు. ఏపీటీఎఫ్ మందస మండల శాఖ ఆధ్వర్యంలో ఉద్దానం ప్రాంతంలోని హరిపురం, అంబుగాం, నారాయణపురం, బహడపల్లి, భేతాళపురం, లోహరిబంద పాఠశాలలను సందర్శించారు. ఆయా ఉపాధ్యాయుల సమస్యల్ని సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 117 జీవో రద్దుకు చర్యలు వేగవంతం చేయాలని, పెండింగులో ఉన్న పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. అప్పటివరకు మధ్యంతర భృతిని ప్రకటించాలని, కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలలో రెగ్యులర్ వార్డెన్, ఏఎన్ఎం పోస్టుల భర్తీ, అప్‌గ్రేడ్ అయిన భాష పండితుల జీతాల సమస్య వంటి పెండింగ్ సమస్యలు అన్నింటినీ పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలకి సంబంధించి ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వ ఉన్నత అధికారులను కలిసి ప్రాతినిధ్యం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ. భీమారావు, మందస మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కిరణ్ కుమార్, కె.సుందరరావు, కార్యవర్గ సభ్యులు ఎన్.ఢిల్లీశ్వర రావు, డి.చంద్రశేఖర్, కె.ధన రాజు, ఎస్.ప్రసాదరావు, వైకుంఠబెహరా తదితరులు పాల్గొన్నారు.



# హెల్మెట్ వాడకంతో ప్రాణాలకు రక్షణ

**జూనియర్ సివిల్ జడ్జి మాధురి**

**పలాస, జులై26(వార్త):** హెల్మెట్ వేసుకోవడం ద్వారా రోడ్డు ప్రమాదాలకు గురైన సమయంలో ప్రాణాలు కాపాడుకోవచ్చని జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి అన్నారు. శుక్రవారం పలాస జూనియర్ సివిల్ జడ్జి మాధురి ఆధ్వర్యంలో హెల్మెట్‌పై అవగాహనా సదస్సును పలాసలో నిర్వహించారు. తొలుత పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా కాలేజీ విద్యా ర్థులు, ఆర్టీసీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ హెల్మెట్ వేసుకోవడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఫయాద్ అహ్మద్, జాయింట్ సెక్రటరీ జిఎంఎస్ అనిల్ రాజు, బీకేఆర్ పట్నాయక్, కోత రజనీ కుమార్, ప్రభాకర్, రవికుమార్, శ్యామ్, చిట్టీ బాబు, డిపో అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.






## బెల్లపు ఊటలు ధ్వంసం

**మెళియాపుట్టి, జులై26 (వార్త):** సవర మర్రిపాడు గ్రామంలో డిటిఎఫ్, ఎస్ఈబి, ఇంటెలిజెన్స్ బృందాలు సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. 800లీటర్ల పులిసిన బెల్లపు ఊటలతో పాటు 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని సిఐ రామచంద్ర కుమార్ తెలిపారు. దాడులలో టెక్కలి ఎస్ఈబి సిఐ రాజశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## 'ఏసీబీకి పట్టించానని దాడి చేస్తున్నారు'

**పలాస, జులై 26 (వార్త):** పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ఎక్సలెంట్ క్యాషూ సప్లయిర్స్‌పై విజయనగరం జీఎస్టీ శాఖా అధికారులు శుక్రవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సప్లయిర్స్ యజమాని శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ గతంలో ఓ కమర్షియల్ అధికారిని ఏసీబీకి పట్టించానని, దీంతో తనకు చెందిన ఎక్సలెంట్ క్యాషూ సప్లయిర్స్‌పై జీఎస్టీ శాఖా అధికారులు దాడులు చేశారన్నారు. ఈవిషయమై జీఎస్టీ అధికారి కె.వెంకటరమణను మీడియా ప్రశ్నించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తనిఖీలు చేస్తున్నామన్నారు.

## స్కానింగ్ సెంటర్లలో..

# లింగ నిర్ధారణపై నిఘా

* లింగ వివక్ష రూపుమాపే చర్యలు చేపట్టాలి * బాలికల విద్యకు ప్రోత్సాహం అందించండి * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం * బేటి బచావో - బేటీ పడావోపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం

*బేటీ బచావో బేటీ పడావోపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం




**శ్రీకాకుళం, జులై26 (వార్త):** లింగ వివక్ష రూపుమాపే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బేటి బచావో - బేటీ పడావోపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సంబంధిత అధికారులుతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా ఉంచాలన్నారు. బాలికల విద్యకు ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లు ఏర్పాటు తప్పనిసరిగా చేయాలని చెప్పారు. ఆర్టీసి కాంప్లెక్సు, రైల్వే స్టేషన్ల వంటి బహిరంగ ప్రదేశాల్లో పాలిచ్చే తల్లులకు ప్రత్యేక క్యాబిన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సెక్స్ రేషియో గూర్చి కలెక్టర్ డిఎంహెచ్ఓ ను అడుగగా గతంలో కంటే సెక్స్ రేషియో అభివృద్ధి ఉందని, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడమైనదని, స్కానింగ్ సెంటర్లు వద్ద నిఘా ఉంచినట్లు ఆమె వివరించారు. డెలివరీకీ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయిస్తారని చెప్పారు. ప్రతీ ఆసుపత్రి నుండి డెలివరీ డేటా ప్రతీ నెల వస్తాయన్నారు. ఆడ పిల్లలు జననాలు తక్కువగా ఉన్న ఆసుపత్రుల పై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సుకన్య సమృద్ధి యోజన బ్యాంకు అకౌంట్లు గూర్చి పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎల్డీయం సూర్యకిరణ్ చెప్పారు. బాలికలకు ఉన్నత విద్యకు ఎలాంటి పూచీ లేకుండా 7 లక్షల రూపాయలు వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి బి. శాంతి శ్రీ బేటీ బచావో - బేటి పడావో పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కౌమార దశలో ఉన్న బాల బాలికలకు లింగ సమానత్వాన్ని గుర్తించే విధంగా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. బాల్య వివాహాలు నివారించుటకు బాలికలకు వారి భవిష్యత్తు తీర్చిదిద్దుకొనే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. శాఖల వారీగా బాలిక సంరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలు గూర్చి వివరించారు. విద్యా ఫౌండేషన్స్ నుండి ప్రసాద్ మాట్లాడుతూ నాబార్డు సహకారంతో గ్రామీణ ప్రాంత యువతులకు వృత్తి నైపుణ్యం మరియు ఉపాధికల్పనా కార్యక్రమాలను నిర్వహించాలని బ్యాంకు రుణాలు ద్వారా వ్యవస్థాగత ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ బిజినెస్ మేనేజ్ మెంట్ అనే సంస్థ ఆధ్వర్యంలో శిక్షకులను నియమించి కొన్ని పాఠశాలల్లో స్టెమ్ (సైన్స్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్) అనే కార్యక్రమం ద్వారా బాలికలకు కంప్యూటర్ విద్య, సైన్స్, టెక్నాలజి, ఇంజనీరింగ్ అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు సర్వశిక్ష అభియాన్ వారు వివరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, మెప్మా పిడి కిరణ్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఎటిడబ్ల్యూఓ శ్రీనివాసరావు, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి మీనాక్షి, సిపిఓ లక్ష్మీ ప్రసన్న, ఆర్ఐఓ దుర్గారావు, డిఈఓ వెంకటేశ్వరరావు, ఎసిపి జయ ప్రకాష్, ఎల్డీయం సూర్యకిరణ్, తదితరులు పాల్గొన్నారు.




## త్యాగానికి మారుపేరు కార్గిల్ వీరులు

### మేధా హైస్కూల్ కరస్పాండెంట్ సోమేశ్వరరావు

**పలాస, జులై 26 (వార్త):** త్యాగానికి మారుపేరు కార్గిల్ వీరులని, దేశ రక్షణ కోసం వారంతా అశువులు బాసారాని మేధా హైస్కూల్ కరస్పాండెంట్ ఐ సోమేశ్వరరావు, డాక్టర్ అరుణ్ అన్నారు. మేధా హైస్కూల్‌లో శుక్రవారం కార్గిల్ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పాఠశాల ఆవరణ నుండి మూడు రోడ్ల జంక్షన్ మీదుగా ఎల్‌సి గేట్ వరకు సాగింది. కార్గిల్ విజయాన్ని పరిష్కరించుకొని అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. మా రక్షణ కోసం ఎన్నో త్యాగాలు చేసిన వారంతా నిజమైన హీరోలని కొనియాడారు. కార్యక్రమంలో మేధా హై స్కూల్ ప్రిన్సిపాల్ బి.సుధాకర్, గైడ్ కెప్టెన్ అమృత, పీఈటీ దిలీప్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుధాకర్, భీమారావు, ఆస్మిన్, నిస్మిత, రత్నాల రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాము కాటుతో రైతు మృతి

**జలుమూరు, జులై 26 (వార్త):** వెలిసాద గ్రామానికి చెందిన ఓ రైతు గురువు త్రినాధరావు గురువారం పొలంలో పనిచేస్తుండగా పాము కాటేసింది. రైతును హుటాహుటిన నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున మృతి చెందాడు.

## కలెక్టర్‌ను కలిసిన సీతంపేట పీవో



**సీతంపేట, జులై 26 (వార్త):** సీతంపేట నూతన ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిగా టి.రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పార్వతీపురంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిగా పనిచేసిన శుభం బన్సల్ బదిలీపై వెళ్లిన విషయం విదితమే.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



**హిరమండలం, జులై26(వార్త):** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని పంచాయతీ అధికారి వి.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలో హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలో జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు ఫ్రైడే - డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు పలు వీధుల్లో పరిసరాల పరిశుభ్రత నిర్వహించారు. ఈ మేరకు మురికి కాలువల్లో ఉండే చెత్తను తొలగించారు. ఆయన వెంట జూనియర్ సహాయకులు ఎ.నర్సింగరావు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## తహశీల్దార్‌కు సన్మానం

**హిరమండలం, జులై26 (వార్త):** తహశీల్దార్ సుధాకర్‌కు బదిలీ కావడంతో రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపతహశీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ ఈశ్వరరావు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తహశీల్దార్ సుధాకర్‌కు సన్మానించారు.





## విజ్ఞానంతోనే వికాసం

**హిరమండలం, జులై 26(వార్త):** విజ్ఞానంతోనే వికాసం మెరుగవుతుందని మండల విద్యాశాఖాధికారి కె.రాంబాబు సూచించారు. శుక్రవారం చిన్నకోరాడ ఎంపీపీ పాఠశాలలో శిక్షా సప్తహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తయారు చేసే వివిధ రకాల ప్రాజెక్ట్ వర్క్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెర్నింగ్ ద్వారా విద్యార్థులకు మరింత అవగాహన వస్తుందన్నారు. విద్యార్థులు ప్రాథమిక విద్య నుంచే చేతిరాతను అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదివేలా ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు ఎస్.జ్యోతి, పి.జయమ్మలకు ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో సీఆర్‌ఎం టి.ధనుంజయరావు పాల్గొన్నారు.

## నూతన సాగుతో అధిక లాభాలు

**బూర్జ, జులై 26(వార్త):** వ్యవసాయ రంగంలో నూతన పద్దతుల ద్వారా అధిక లాభాలను ఆర్జించవచ్చని ఏడీ బొడ్డేపల్లి రాజగోపాల్ అన్నారు. తుడ్డలి గ్రామంలోని ఎనిమిది ఎకరాల ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో నూతన విధానం డ్రమ్ సీడర్ ద్వారా వరి విత్తనాలు జల్లే విధానాన్ని రైతులకు చూపించారు. ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని ప్రతి రైతు ఆధునిక పద్ధతులను అవగాహన చేసుకుని ప్రకృతి వ్యవసాయాన్ని చేసినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏవోలు శ్రీనివాసరావు, రేవతి, ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ యంటీ చిన్నమ్మడు, యూనిట్ ఇన్చార్జ్ గురువు జనార్ధనరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## నరసాపురం సచివాలయం ఖాళీ

* సమయపాలన పాటించని సిబ్బంది
* మహిళా పోలీస్ మాత్రమే దర్శనం
* పట్టించుకోని ఉన్నతాధికారులు



**సంతబొమ్మాళి, జులై 26(వార్త):** మండలంలో నరసాపురం సచివాలయంలో శుక్రవారం సిబ్బంది లేకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సచివాలయంలో ఉండవలసిన ఏ సిబ్బంది లేకపోవడం గమనార్హం. సచివాలయంలో 11 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా శుక్రవారం ఒక్క మహిళా పోలీస్ మాత్రమే సమయానికి విధుల్లోకి వచ్చారు. మిగతా సిబ్బంది సమయపాలన పాటించక పోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికి ఏ పని అవసరమైన సిబ్బందికి ఫోన్ చేస్తేనే వస్తున్నారని లేకపోతే కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎంపీడీవో ప్రేమలీలను వివరణ కోరగా సచివాలయాన్ని పరిశీలించి తగు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

### నౌపడ సచివాలయంలో డీఎల్‌డీవో తనిఖీ



నౌపడ సచివాలయం-1ను శుక్రవారం డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామ సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. బయోమెట్రిక్ విధానం తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. సిబ్బంది సమయం పాలన పాటించాలని లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మేఘవరం సచివాలయంలో ఆధార్ డ్రైవ్, రికార్డులు పరిశీలించారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413